## క్లుప్తంగా

### కొలచనకోటలో స్కూల్ రెడీనెస్ మేళా

**మద్దిపాడు:** మండలంలోని కొలచనకోట గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు సోమవారం స్కూల్ రెడీనెస్ కార్యక్రమం నిర్వహించారు. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఇవాంజెలిన్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటి వద్ద లభించే వస్తువులతో పిల్లల సామర్థ్యాన్ని పరీక్షించే విధానాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ సెంటర్ల నుంచి ఎలిమెంటరీ పాఠశాలలకు వెళ్లే పిల్లల కోసం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పిల్లల స్థాయిని తల్లిదండ్రులకు వివరించారు. ఐటీసీ జిల్లా ప్రదం కో ఆర్డినేటర్ వై.వెంకటలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల అభివృద్ధి స్థాయిని తెలుసుకున్నారు. గ్రామం నుంచి 15 మంది పిల్లలకు అసెస్మెంట్ నిర్వహించి చిన్నారుల అభ్యసన మెరుగుపరిచే విధంగా పలు సలహాలు, సూచనలను సూపర్‌వైజర్ నాగరాజి వివరించారు. చివరిగా చిన్నారులతో వారి తల్లులు సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కిశోరి బాలిక వికాసంపై సమావేశం

**మద్దిపాడు:** కిశోరి బాలికల వికాసం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 1 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి మంగళ, శుక్రవారాలు వివిధ అంశాలపై కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామంలో గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు టీంగా ఏర్పడి కిశోర బాలికలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జి ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్, ఎంఈఓ ఎం.వి.ఆర్.ఆంజనేయులు, వెలుగు సీసీ వెంకట సుబ్బయ్య, సీహెచ్ఓ రజిత కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, పద్మావతి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### ఉల్లాసంగా వేసవి శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

**నాగులుప్పలపాడు:** వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఉల్లాసంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన శిక్షణలో తెలగతోటి శ్యామ్యూల్ విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పించడంతో పాటు ఆటలు ఆడించారు. కార్యక్రమంలో శిక్షకుడు నాగరాజ కుమారి, గ్రంథపాలకుడు ధనమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

### వేసవి శిక్షణ శిబిరాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సంపూర్ణ

**ఒంగోలు మెట్రో:** జిల్లా కేంద్ర గ్రంథాలయం వేసవి శిక్షణ శిబిరాలు వినియోగించుకోవాలని ఇన్చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి కోరారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పలువురు ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు.

# పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

ఒంగోలు సబర్బన్:

జిల్లాకు చెందిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలను కలెక్టర్ పి.రాజాబాబు అభినందించారు. ఈ మేరకు కలెక్టర్ చాంబర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజరాజేశ్వరి క్రీడాకారులను కలెక్టర్‌కు పరిచయం చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన 13వ ఏపీ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు విజయం సాధించారు. విజయం సాధించిన వారిలో ఎన్.గాయత్రి 47 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎం.ఐశ్వర్య 57 కేజీల విభాగంలో కాంశ్య పతకం, బి.కార్తీక 52 కేజీల విభాగంలో రజిత పతకం, ఎం.సునీత (మాస్టర్స్–1) 69 కేజీల విభాగంలో కాంశ్య పతకం, జి.శక్తీధర శ్రీచంద్ర 120 కేజీల విభాగంలో బంగారు పతకం




విజేతలతో కలెక్టర్ రాజాబాబు

సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బీవీఎల్ కుమార్ (మాస్టర్స్–1) 83 కేజీల విభాగంలో కాంస్య పతకం షేక్. మస్తాన్ వలి (మాస్టర్స్–1) 93 కేజీల విభాగంలో రజిత పతకం సాధించారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.భక్తుద్రుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.పవన్‌కుమార్ ఉన్నారు.

# విద్యుత్ కోతలు.. ప్రజల వెతలు..

- ఒంగోలు రూరల్ మండలంలో ఇష్టంవచ్చినట్లు కరెంట్ కోతలు
- అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు ఇక్కట్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

**ఒంగోలు సిటీ:** ఒంగోలు మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క ప్రచండ భానుడి ధాటికి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటే మరో పక్క విద్యుత్ కోతలు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కపోత తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఇక రాత్రిళ్లు కోతలు తప్పడం లేదు. ఉదయం ఎలాగోలా అనుకుంటే రాత్రిళ్లు ఓ సమయం లేకుండా ఇష్టారాజ్యంగా విధిస్తున్న కోతలతో నిద్రపట్టడం లేదని వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేద్దామని ప్రయత్నించినా విద్యుత్ శాఖాధికారులు స్పందించడం లేదంటున్నారు. దీనికి లో ఓల్టేజీ సమస్య అదనం. లో ఓల్టేజీతో విద్యుత్‌ఉపకరణాలు దెబ్బతింటున్నాయని, ఎన్నో రోజులుగా ఈ సమస్య ఉన్నా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు.

**24 గంటలైనా రాని కరెంట్..**

ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంమారింది. ఒంగోలు మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వాన కురిసింది. గాలివాన దెబ్బకు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. అయితే 24 గంటల సమయం గడిచినా సోమవారం సాయంత్రానికి కూడా విద్యుత్‌ను పునరుద్ధరించలేకపోయారు. దీంతో 24 గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో ఒంగోలు మండల ప్రజల కష్టాలు చెప్పేవీ కావు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఒంగోలు మండల ప్రజలు కోరుతున్నారు.

## స్వదేశీ వస్తువుల ప్రోత్సాహంతో దేశాభివృద్ధి

**ఒంగోలు మెట్రో:** స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం, వినియోగం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని స్వదేశీ జాగరణ్ మంచ్ దక్షిణ భారత సంయోజకులు జగదీష్ జీ తెలిపారు. స్థానిక వీఐపీ రోడ్డులోని బృందావనంలో సోమవారం ఉదయం జరిగిన స్వదేశీ జాగరణ మంచ్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విదేశీ వస్తువులును ఉపయోగిస్తే దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వాలు తగ్గి రూపాయి విలువ పతనం అవుతుందని, భారతీయులంతా స్థానిక ఉత్పత్తులను వినియోగిస్తే ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. సేంద్రియ వ్యవసాయాన్ని కూడా అధికంగా చేపట్టాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రముఖ్ యుగంధర్ జీ తెలిపారు. త్వరలో ఒంగోలులో స్థానిక వస్తువుల సంత నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు తెలిపారు. స్థానిక ఉత్పత్తులనే వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. రాజేష్ జీ, నల్లమల్లి కోటి సూర్యనారాయణ, చలపతిరావు, యోగగురువు బాలు, రంగ మన్నార్, ధర్మవరపు శ్రీనివాసులు, మాల్యాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్ జీ

## గోపి కుటుంబ సభ్యులకు పరామర్శ



కూనంనేనివారిపాలెంలో గోపి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్

**చీమకుర్తి రూరల్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు అల్లుడు గోపి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ సోమవారం పరామర్శించారు. ఆయన కూనంనేనివారిపాలెంలో వారి గృహానికి వెళ్లి పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఓబులరెడ్డి, నియోజకర్గ బూత్ కమిటీ కన్వీనర్ బొడ్డు కోటేశ్వరావు, రైతు విభాగం మండల అధ్యక్షుడు రామచంద్రరావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎస్ వెంకటరావు పేరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసంపై అవగాహన అవసరం

**నాగులుప్పలపాడు:** కౌమార దశ కలిగిన బాలికలకు ఆరోగ్యం, భద్రత, ఆహారం, హక్కులు వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండేలా కిశోరి వికాసం కార్యక్రమం దోహదపడాలని ఎంపీడీఓ తేళ్ల రవికుమార్ అన్నారు. కిశోరి వికాసం 2.0 శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 11–19 మధ్య వయసున్న కిశోరి బాలికలకు నిర్వహించనున్న 13 రోజుల శిక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతను గుర్తెరిగి వారి ఉన్నతి కోసం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భాగంగా మంగళవారం ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఎంఈఓ రమణయ్య, ఏపీఎం నరేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవికుమార్

### సబ్సిడీపై పశుదాణ

**బల్లికురవ:** పాల ఉత్పత్తి పెంపొందించేందుకు 50 శాతం సబ్సిడీపై పశుదాణ పంపిణీ చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారులు పి. ఉమామహేశ్వర రావు, ఆర్.పావనికుమారి తెలిపారు. సోమవారం అంబడిపూడి పశువైద్యశాలకు కేటాయించిన 9 టన్నులను పంపిణీ చేశారు. మంగళవారం బల్లికురవ పశువైద్యశాలకు కేటాయించిన 7 టన్నులను బల్లికురవ, కొప్పరపాలెం, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాల పశుపోషకులకు బల్లికురవలో పంపిణీ చేస్తామని చెప్పారు. కూకట్లపల్లి పశువైద్యశాలకు 7 టన్నులు కేటాయించారని, రైతులు ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నంబర్‌తో సంప్రదించాలన్నారు. ఎస్టీలకు 7 శాతం, ఎస్సీలకు 15 శాతం, మిగలినవి ఇతరులకు ఒక్కో రైతుకు 50 కేజీల బస్తా వరకు అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారులు కోరారు.

### గరుడ వాహనంపై చెన్నకేశవ స్వామి



ముస్తాబైన చెన్నకేశవస్వామి

**ఒంగోలు మెట్రో:** స్థానిక కొప్పోలు చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ సమీర్ కుమార్ ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం చెన్నకేశవ స్వామికి భక్తిశ్రద్ధలతో పూజాక్రతువులు నిర్వహించారు. రాత్రి చెన్నకేశవ స్వామి సర్వాలంకార భూషితడే గరుడ వాహనంపై కొప్పోలు గ్రామ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

### మాతంగి దేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**ఒంగోలు మెట్రో:** ఒంగోలు నగరలోని 16వ డివిజన్ చెరువుకొమ్ముపాలెంలో సోమవారం ఉదయం ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో మాతంగి దేవి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నిర్మాణ పనుల్లో భాగంగా కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి మాతంగి మహాపీఠం పీఠాధిపతి మాతంగి నందగిరి స్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. హోమగుండం వద్ద ఒంగోలు నగర మాజీ మేయర్ గంగాడ సుజాత ప్రత్యేక పూజలు చేశారు.

### వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



శీలం సుబ్బారావు (ఫైల్)

**చీమకుర్తి:** చీమకుర్తికి చెందిన శీలం సుబ్బారావు(66) ఆదివారం రాత్రి వీచిన గాలివాన బీభత్సంలో ఏమయ్యాడో తెలియడం లేదని కుమారుడు శీలం శివకృష్ణ సోమవారం మీడియాకు తెలిపాడు. ఆదివారం రాత్రి గాలివాన రాబోయే ముందు ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, గాలివాన ఆగిన తర్వాత ఇంటికి వస్తాడని చూశామని, రాత్రంతా ఎదురుచూసినా ఆచూకీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అంతా చీమకుర్తి చుట్టుపక్కల ప్రాంతాలు వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శివకృష్ణ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 99897 26377 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## వసతి గృహాల్లో ప్రవేశాలు ప్రారంభం

**ఒంగోలు వన్‌టౌన్:** జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థుల కలలకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో 936 మంది పరీక్షలు రాయగా 88 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. జిల్లాలోని 23 హాస్టళ్లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యధికంగా 583 మార్కులను ఎన్.జగదీశ్వరరెడ్డి అనే విద్యార్థి సాధించినట్లు తెలిపారు. 550 మార్కులకు పైగా 58 మందికి, 500 మార్కుల నుంచి 549 మార్కుల మధ్య 137 మందికి వచ్చాయన్నారు. 772 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో పాసైనట్లు తెలిపారు. ప్రతి వసతి గృహంలో సీసీ కెమెరాలు ఉన్నట్లు, ఆర్వో ప్లాంట్‌ల ద్వారా తాగు నీరు, పౌష్టికాహారం, ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 3వ తరగతి నుంచి వసతి గృహంలో అడ్మిషన్లు పొందొచ్చన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓబీసీ విద్యార్థులు సమీపంలోని సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని డీడీ వివరించారు.

## అగ్నిమాపక సిబ్బందిని సత్కరించిన జేసీఐ



అగ్నిమాపక సిబ్బందికి ఫ్రిడ్జ్ బహూకరిస్తున్న జేసీఐ

**ఒంగోలు టౌన్:** అంతర్జాతీయ అగ్నిమాపక యోధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బందిని ఘనంగా సత్కరించారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో సోమవారం జరిగిన వేడుకలను జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఇంట్లో వినియోగించే ఏసీలు, వాషింగ్ మిషన్ల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మొబైల్ ఫోన్ చార్జింగ్, వినియోగం గురించి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జూనియర్ చాంబర్ అధ్యక్షుడు శబరీనాథ్, రెడ్‌క్రాస్ మాజీ అధ్యక్షుడు ప్రకాష్, జేసిస్ కార్యదర్శి శ్రీనివాస్, నూనె వంశీకృష్ణ, బాలకృష్ణ, గణేష్, రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బందికి రిఫ్రజిరేటర్, ఎలక్ట్రికల్ ఓవెన్ బహూకరించారు.

## విద్యార్థులకు నగదు బహుమతులు

**మేదరమెట్ల:** కొరిశపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన విద్యార్థులను రావినూతల జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం స్థానిక ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీ అభినందించారు. అలాగే ఒక్కొక్కరికి పది వేల రూపాయలు చొప్పున నగదు బహుమతులు అందించారు. మండల విద్యాశాఖాధికారి–2 వీరరాఘవయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మండల ప్రథమ స్థానం సాధించిన రావినూతల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎస్కే షర్మిల, ద్వితీయ స్థానం సాధించిన జడ్పీహెచ్ఎస్ మేదరమెట్ల విద్యార్థి సంతోష్, తృతీయ స్థానం సాధించిన జెడ్పీహెచ్ఎస్ రావినూతల విద్యార్థిని సీహెచ్ లక్ష్మి, మండల చతుర్థ స్థానం సాధించిన జెడ్పీహెచ్ఎస్ రావినూతల విద్యార్థిని ఎం.వర్షను పలువురు అభినందించారు. కార్యక్రమానికి హెచ్ఎం రాఘవరెడ్డి అధ్యక్షత వహించగా తల్లిదండ్రులు, స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బుజ్జి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## స్పోకెన్ ఇంగ్లిష్‌తో ఉపయోగం

**సంతమాగులూరు (అద్దంకి):** స్పోకెన్ ఇంగ్లిష్‌తో విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్‌ను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని చెప్పారు. ఎంతో ఉపయోగం ఉన్న విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఆర్పీ ఏ.ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి

# గాలివాన బీభత్సం



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభాలు

- నేలకూలిన మొక్కజొన్న పంటలు
- విరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు

**తాళ్లూరు:** మండలంలో ఆదివారం రాత్రి భారీ గాలీవానకు పలు గ్రామాల్లో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో కొన్ని గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కోత దశలో ఉన్న మొక్కజొన్న పంట నేల కూలడంతో రైతులకు అదనపు కూలీ ఖర్చులు పెరిగి పెట్టుబడి అధిక భారమైంది. మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన కొర్రపాటి సుబ్బారావు అనే రైతు 10 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. రెండు రోజుల్లో మిషన్ కోత కోయించాలనుకున్నాడు. ఈ లోపు భారీ గాలులతో పంట నేలకూలింది. అదనపు ఖర్చు అవుతుందని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు. అలాగే బొద్దికూరపాడు నుంచి రాజంపల్లి ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు విరిగి పోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం విద్యుత్‌శాఖాధికారులు అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు.

**అద్దంకి:** అకాల గాలి,వర్షంతో డివిజన్‌లో పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని విద్యుత్‌శాఖ ఈఈ మస్తాన్‌రావు సోమవారం తెలిపారు. డివిజన్‌లో సోమవారం రాత్రి కురిసిన గాలి, వర్షంతో డివిజన్ పరిధిలో 84 విద్యుత్ స్తంభాలు, 22 ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్స్ దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వాటి విలువ రూ.15.50 కోట్లు ఉంటుందని తెలిపారు. సోమవారం సాయంత్రానికే డివిజన్‌లో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను, కేబుల్స్‌ను పునరుద్ధరించినట్లు ఈఈ తెలిపారు.



మొక్కజొన్న పంట వద్ద రైతు కొర్రపాటి సుబ్బారావు

## డప్పుల పోటీలు విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**దర్శి:** పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే జాతీయ స్థాయి డప్పుల పోటీలకు భారీగా తరలి రావాలని కన్వీనర్ యర్రగుంట్ల భాస్కర్ కోరారు. స్థానిక కర్టిస్ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో జాతీయ స్థాయి పోటీల వాల్ పోస్టర్లు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణంలో ఈ నెల 9,10వ తేదీల్లో జాతీయ స్థాయి డప్పుల దరువు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డప్పు కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల గోవింద ప్రసాద్, దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు నేరెళ్ల జాన్, కర్టిస్ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ సెక్రటరీ గర్నెపూడి ప్రేమ్‌కిషోర్, ట్రెజరర్ నూనె హానోకు, గర్నెపూడి యాకోబు, గర్నెపూడి అజయ్, బేతం మోజేష్, చాట్ల సైకిలాబ్, బంకా ఎలియాజర్, శశి, సుమంత్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762 , 96039 87970
Office mail : sakshiongads@gmail.com